క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



తడకలపల్లి వద్ద ఆగి ఢీకొన్న లారీలు

మడకశిరరూరల్: తడకలపల్లి గ్రామ సమీపంలో గురువారం హైవే ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. ఘటనలో ముందున్న లారీని ఇనుప రాడ్లు వెనుకున్న లారీలోకి దూసుకెళ్లాయి. ఘటనలో డ్రైవర్, క్లీనర్లు స్వల్పగాయాలతో బయట పడ్డారు. వెనుకవైపున్న లారీ ముందు భాగంగా దెబ్బతినింది. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కార్మికులంతా ఐక్యంగా ఉండాలి



పరిగిలో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న వెంకటేష్ తదితరులు

పరిగి: కార్మికులంతా ఐక్యంగా హక్కులకోసం పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ కోరారు. మండల కేంద్రంలో గురువారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ తొలుత జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఐటీయూ 53 ఏళ్లుగా కార్మిక, కర్షక, రైతుల పక్షాన అనేక ఉద్యమాలు చేసిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడటమే సీఐటీయూ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మండల నాయకుడు సజ్జరాయప్ప, పంచాయతీ,స్వచ్ఛ భారత్ వర్కర్స్ యూనియన్ నేతలు రామాంజి, మూర్తి, గంగాధర్, హనుమంతు, నరేష్, హనుమయ్య, కొల్లప్ప పాల్గొన్నారు.

అగ్రహారంలో వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రొళ్ల: అగ్రహారం గ్రామంలో గురువారం శారదమ్మ తిప్పేస్వామి జ్ఞాపకార్థం వారి సోదరులు బెంగళూరులో స్థిరపడిన ఆజాద్ ఐఏఎస్ అకాడమీ ప్రొప్రైటర్ శ్రీనివాస్, డాక్టర్ రామక్రిష్ణప్ప ఆధ్వర్యంలో బెంగళూరు చెందిన సంరక్ష ప్రైవేట్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు శుభా, మోహిత్, ఆద్య, చందన, వసంత్ ఎన్ పాటిల్ తదితరులు రోగులకు 2డీ ఎకో, షుగర్, ఎముకల పరీక్షలు, బీపీ, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 30 మంది కంటి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. మిగిలిన రోగులకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరానికి హాజరైన రోగులకు భోజనం సౌకర్యం కల్పించారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు



మధూడిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వీరేష్

అగళి: మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్ఐ వీరేష్ తెలిపారు. మధూడి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఓట్ల లెక్కింపు తర్వాత హింసాత్మక ఘటనలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులకు సహకరించాలన్నారు.

జూదరుల అరెస్ట్

మడకశిర: గుండుమల అటవీప్రాంతంలో గురువారం సాయంకాలం పోలీసులు మెరుపు దాడి చేశారు. మడకశిర అర్బన్ సీఐ మనోహర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.12,600 నగదును స్వాధీనం చేసుకున్నారు.స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఈదాడి చేసి జూదరులను అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని ఆయన కోరారు.

ముందస్తు వర్షం.. బోర్లకు ప్రాణం

- భూగర్భ జలాలు పెరిగే అవకాశం
- ఆనందంలో అన్నదాతలు
- గతేడాది వర్షాలు రాక వ్యవసాయ బోర్లలో తగ్గిన నీటి మట్టం

మడకశిర: నియోజకవర్గంలో ఇటీవల విస్తారంగా వర్షాలు కురువడంతో రైతులకు భారీ ఊరట లభించింది. వ్యవసాయ బోర్లు రీచార్జ్ కావడానికి అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో వేల సంఖ్యలో వ్యవసాయ బోర్లు ఉన్నాయి. ఈబోర్ల కింద రైతులు రూ. కోట్ల పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశారు. ప్రధానంగా వక్క తోటలను పెద్ద ఎత్తున పెంచారు. ఇలాంటి పరిస్థితిలో ఇటీవల కురిసిన వర్షాలకు వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరిగే అవకాశం ఏర్పడింది. ఎండిపోయే పరిస్థితిలో ఉన్న బోర్లకు ప్రాణం వచ్చింది.

గత ఏడాది వర్షాభావం

నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి సౌకర్యం ఏమాత్రం లేదు. వర్షాలు, వ్యవసాయ బోర్లపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకోవాలి. ఈనేపథ్యంలో గతేడాది నియోజకవర్గవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా భూగర్భజలం ఇంకిపోయింది. వ్యవసాయ బోర్లు రీచార్జ్ కావడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో బోర్లలో క్రమేణా నీటి మట్టం తగ్గతూ వచ్చింది. భూగర్భ జలాలు అడుగంటడంతో కొన్ని బోర్లు ఎండిపోయాయి. మరికొన్నింటిలో నీరు రావడం తగ్గింది. బోర్లనే నమ్ముకుని సాగు చేసిన వక్క తోటలు, ఇతర పంటలను ఎలా కాపాడుకోవాలనే టెన్షన్ రైతుల్లో మొదలైంది.ఈ పరిస్థితిలో ముంగారు వర్షాలు విస్తారంగా పడడంతో రైతుల్లో కొంత వరకు టెన్షన్ తగ్గింది.



అమరాపురంలోని ఓ పొలంలో వ్యవసాయ బోరు నుంచి వస్తున్న నీరు

బోర్లకు జలకళ..

నియోజకవర్గవ్యాప్తంగా వర్షాలు కురువడంతో భూగర్భజల మట్టం క్రమేణా పెరగడానికి అవకాశం కలిగింది. వర్షాలు పడడంతో వంకలు, వాగులు ప్రవహించాయి. చెక్‌డ్యామ్‌లకు నీరు చేరింది. ఈవర్షాలు ఇలాగే కొనసాగితే వంద శాతం భూగర్భజల మట్టం పెరిగి బోర్లకు పూర్తి స్థాయిలో జల కళ వస్తుంది. ఇదిలా ఉండగా వ్యవసాయబోర్లపై పెట్టుబడి దినదినానికి పెరుగుతూనే ఉంది. కొత్తగా బోరు తవ్వించి మోటార్ బిగించడానికి రూ.5 లక్షల నుంచి 6 లక్షలు అవసరమవుతాయి. ఒకవేళ బోరు తవ్వించినా..... నీరు లభించకపోతే రైతులు రూ.లక్షలు నష్ట పోవాల్సి ఉంటుంది. కొత్త బోర్లపై పెట్టుబడి పెట్టి అప్పులు పాలు కాకుండా ఉండేందుకు ఈవర్షాలు దోహదం చేశాయని రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది



ప్రస్తుతం కురిసిన వర్షాలతో పెద్ద ఊరట లభించింది.వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరగడానికి అవకాశం ఏర్పడింది.వక్క తోటలను కాపాడు కోవచ్చనే ధైర్యం వచ్చింది.గత ఏడాది పూర్తిగా వర్షాలు పడ లేదు.దీంతో భూగర్భజల మట్టం పడి పోయింది.చాలా బోర్లు ఎండి పోయే పరిస్థితి ఏర్పడింది.ఇలాంటి గడ్డు పరిస్థితిలో వర్షం పడడం ఎంతో ఆనందంగా ఉంది.

–కరియప్ప, తమదేపల్లి, అమరాపురం మండలం

అప్పుల చేసే పరిస్థితి తప్పింది



వర్షాలు పడడంతో వ్యవసాయ బోర్లకు ముప్పు తప్పింది. లేకపోతే వక్కతోటలు, ఇతర పంటలను కాపాడుకోవడానికి కొత్తగా బోర్లు వేయడానికి అప్పులు చేసే పరిస్థితి ఏర్పడేది. అయితే వర్షాలు కురవడంతో అప్పులు చేసే పరిస్థితి తప్పింది. వర్షాలు ఇలాగే పడితే బోర్లలో నీటి మట్టం పెద్ద ఎత్తున పెరిగే అవకాశం లేకపోలేదు. ముంగారులో వర్షాలు ఆశించిన స్థాయిలో పడుతుండడంతో నీటి కష్టాల నుంచి బయట పడడం ఖాయం.

–శ్రీనివాస్, హెచ్‌టీహళ్లి, రొళ్ల మండలం

చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

రొళ్ల: 'రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ 60 నెలల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందించి అందరి ఆప్యాయతను సొంత చేసుకున్న ఏకైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. అన్ని వర్గాల ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడికి ఇవే చివరి ఎన్నికలు' అని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. గురువారం హొట్టేబెట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీధర్ ఇంట్లో జరిగిన ఓ వేడుకలకు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప హాజరయ్యారు. తర్వాత కొత్తపాళ్యం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప స్వగృహంలో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. అనంతరం ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రొళ్ల మండలం వ్యాప్తంగా గల 32 పోలింగ్ కేంద్రాల వారీగా నమోదు అయిన పోలింగ్ సరళి పై సమీక్షించారు. అనంతరం ఈరలక్కప్ప మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా వలంటీర్లతో నేరుగా ఇంటింటికే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం పెరగడం వైఎస్సార్‌సీపీకి కలిసి వచ్చిందన్నారు.

ఎన్నడూ లేని విధంగా మడకశిర నియోజకవర్గంలో 83 శాతంపైగా పోలింగ్ నమోదైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ కూడా వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇచ్చారని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే దమ్ములేక టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకుని ఎన్నికలకు రావడం సిగ్గు చేటని విమర్శించారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలే చంద్రబాబుకు చివరి ఎన్నికలని ఎద్దేవా చేశారు. మడకశిర నియోజకవర్గంలో 15 వేలకు పైగా మెజార్టీతో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడంతో పాటు హిందూపురం పార్లమెంట్ స్థానం కూడా వైఎస్సార్‌సీపీ కై వసం చేసుకోవడం ఖాయమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, పార్టీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ శివన్న, మాజీ ఎంపీటీసీ కేజీ గుట్ట కాలనీ శివన్న, నాయకులు కాంతప్ప, ఆనంద్, భోజేగౌడు, మంజునాథ్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



రొళ్ల మండలం కొత్తపాళ్యంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

గోరంట్ల: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీసులు స్టేషన్ ఆవరణలో అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మండలవ్యాప్తంగా 144 సెక్షన్‌తో పాటు పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. గ్రామాల్లో గుంపులు గుంపులుగా జనం ఉండరాదన్నారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత విజయోత్సవాలు నిర్వహించరాదని, టపాసులు కాల్చడానికి అనుమతిలేదన్నారు.

కనగానపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగిరి సీఐ శివాంజనేయులు, కనగానపల్లి ఎస్ఐ మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలను వివరించారు.

బీసీజీ టీకాతో క్షయ నిర్మూలన

పరిగి: బీసీజీ టీకాతో క్షయ వ్యాధి నిర్మూలన సాధ్యమని జిల్లా బాలస్వాస్థ్య కార్యక్రమాల పర్యవేక్షణాధికారి డాక్టర్ నివేదిత తెలిపారు. గురువారం మండలంలో జరుగుతున్న బీసీజీ టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఆమె పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఓపీ సేవలను పెంచాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వయోజనులకు బీసీజీ టీకా కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి, రూబీ, సీహెచ్ఓ వన్నప్ప, పీహెచ్ఎన్ వెంకమ్మ, సూపరింటెండెంట్లు వేణుగోపాల్‌రెడ్డి, రవీంద్ర, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం 424 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.



వైద్యులతో సమావేశమైన డాక్టర్ నివేదిత

జోరుగా విత్తన వేరుశనగ పంపిణీ



గుట్టూరులో రైతులకు వేరుశనగ పంపిణీ చేస్తున్న దృశ్యం



చిలమత్తూరు-1 ఆర్బీకే వద్ద విత్తనకాయలు తీసుకుంటున్న రైతులు

మడకశిర: నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయడానికి వీలుగా రైతులకు వేరుశనగ విత్తన కాయల పంపిణీ జోరుగా సాగుతోంది. 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం రైతులకు అందిస్తున్న విషయం తెలిసిందే. నియోజకవర్గంలోని 71 ఆర్బీకేల పరిధిలో కూడా విత్తన కాయలను పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు. మొదటి రోజే నియోజకవర్గ వ్యాప్తంగా 4,689 మంది రైతులకు 4,089.80 క్వింటాళ్ల విత్తన కాయలను అందించామన్నారు. మడకశిర మండలంలో 670 మందికి 520 క్వింటాళ్లు, గుడిబండ 1,526 మందికి 1,406, అమరాపురం 1,447 మందికి 1,303, రొళ్ల 650 మందికి 550, అగళి మండలంలో 396 మందికి 310.80 క్వింటాళ్ల చొప్పున విత్తన కాయలను అందించినట్లు ఏడీఏ తెలిపారు. రెండో రోజు గురువారం కూడా అదే స్థాయిలోనే విత్తనకాయల పంపిణీ జరిగినట్లు వివరించారు.

పెనుకొండ రూరల్: నాగలూరు, మావటూరు, శెట్టిపల్లి, మునిమడుగు, వెంకటగిరిపాళ్యం, గోనిపేట ఆర్బీకేల్లో గురువారం రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 886 మంది రైతులు 773 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకోగా ఇప్పటి వరకూ 530 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి చందన తెలిపారు.

చిలమత్తూరు: మండలంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ గురువారం కొనసాగింది. మండలవ్యాప్తంగా 2,245 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 1810.2 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ వంశీకృష్ణ తెలిపారు.

న్యాయవాది సంపత్‌రాజ్ హత్య దారుణం

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన యువ న్యాయవాది సంపత్‌రాజ్ హత్య దారుణమని న్యాయవాదులు, విద్యార్థి సంఘాలు, దళిత సంఘాల నేతలు పేర్కొన్నారు. గురువారం విద్యార్థి సంఘాల నాయకులు స్థానిక బాలుర వసతి గృహం వద్ద సంపత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు బాబావలి, చంద్రశేఖర్ రెడ్డి, నాగభూషణ, కదిరేష్, తరుణ్, జస్వంత్, విక్రమ్, నవీన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరమ్మ సర్కిల్ వద్ద సంపత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంపత్ హత్యపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, హంతకులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ సంపత్‌ను హత్య చేసిన వారి వెంటనే పట్టుకుని శిక్షించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు రమణ, శ్రీరాములు, రవికుమార్, మద్దిలేటి, సుబ్బరాయప్ప, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.



సంపత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

న్యాయవాదుల విధుల బహిష్కరణ

యువ న్యాయవాది సంపత్ హత్యను ఖండిస్తూ గురువారం హిందూపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. పోలీసులు దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

చెన్నేకొత్తపల్లికి చేరిన అహింస సంస్కార్ పాదయాత్ర

చెన్నేకొత్తపల్లి: జైన మత గురువు ప్రసన్న సాగర్‌తో పాటు మరి కొందరు చేపట్టిన అహింస సంస్కార్ పాదయాత్ర గురువారం చెన్నేకొత్తపల్లికి చేరుకుంది. వీరికి స్థానిక మోడల్ స్కూల్‌లో విడిది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాదయాత్రలోని బృందం సభ్యుడు మాట్లాడుతూ.. ఏడాదిలో నాలుగు నెలలు మినహా మిగిలిన ఎనిమిది నెలలు ఈ పాదయాత్ర చేస్తూనే ఉంటామన్నారు. చతుర్మాసంలో వర్షాలు కురుస్తూ ఉంటాయని దీంతో ఈ నాలుగు నెలలు పాదయాత్రకు విరామం ఉంటుందన్నారు. రోజూ పది కిలోమీటర్లు మాత్రమే పాదయాత్ర సాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు లక్ష కిలోమీటర్ల వరకు పాదయాత్ర సాగిందని.. ఈ పాదయాత్రకు విరామం లేదన్నారు. ఇతరుల పట్ల ప్రేమానురాగాలను కలిగి ఉండటం, జీవహింస చేయొద్దని భక్తులకు వివరిస్తూ ఈ పాదయాత్ర సాగుతుందన్నారు. రోజుకు ఒకసారి మాత్రమే గురువు ఆహారం తీసుకుంటారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఈ పాదయాత్ర యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

- 18 రౌండ్లలో మడకశిర కౌంటింగ్
- రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్‌రావు



మాట్లాడుతున్న గౌరీశంకర్‌రావు

మడకశిర: మడకశిర అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్‌రావు తెలిపారు. ఆయన గురువారం సాక్షితో ఓట్ల లెక్కింపునకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జూన్ 4న హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని కోరారు. అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌ను తెరుస్తామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,796 ఉన్నాయని, వీటి లెక్కింపునకు రెండు టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇక ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపును 18 రౌండ్లలో పూర్తి చేయనున్నామని, ఇందుకోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు ఒక టేబుల్‌కు ఒకరు చొప్పున 16 మంది కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు అభ్యర్థులు, ఏజెంట్లు, వివిధ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..



ప్రాథమిక పాఠశాలలో పుస్తకాలను భద్రపరిచిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: వేసవి సెలవులు ముగిసిన అనంతరం జూన్ నెలలో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితం పాఠ్యపుస్తకాలను అందజేస్తోంది. ఇందులో భాగంగా చెన్నేకొత్తపల్లి మండలానికి రెండవ విడతలో 15,009 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓలు మున్వర్ బాషా, ప్రసన్నకుమార్ నాయుడు గురువారం తెలిపారు. 8, 9, 10వ తరగతులకు సంబంధించి అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ పుస్తకాలను ప్రాథమిక పాఠశాలలో భద్రపరిచామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది శివారెడ్డి, రామసుబ్బారెడ్డి, కేశవ, శివయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ సిబ్బందితో సుంకం వసూలు

పెనుకొండ: నగర పంచాయతీ సిబ్బంది ద్వారా పట్టణంలో వివిధ రకాల సుంకాలు వసూలు చేస్తామని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయితీ కార్యాలయంలో గురువారం చైర్మన్ అధ్యక్షతన నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వేసిన వివిధ సుంకాల టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం పూర్తయిందన్నారు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తదుపరి టెండర్లు వేయలేదన్నారు. దీంతో శుక్రవారం నుంచి నగర పంచాయతీ సిబ్బంది సుంకాలు వసూలు చేస్తారన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తవ్వగానే వేలం దారులకు సుంకాల వసూళ్ల బాధ్యత అప్పగిస్తామన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇతర సమస్యలపై సమావేశంలో ఎలాంటి చర్చ సాగలేదు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు తయూబ్, రఘునాథరెడ్డి, శేషాద్రి, రామాంజినేయులు, భాస్కర్‌నాయక్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బడి ఈడు దివ్యాంగ పిల్లల గుర్తింపు



అంగనవాడీ కేంద్రంలో నమోదు చేయించిన ఉపాధ్యాయులు

లేపాక్షి: దివ్యాంగులైన బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడానికి సర్వే నిర్వహిస్తున్నామని సహిత విద్యా ఉపాధ్యాయురాలు కే.హర్షిణి, నరసమ్మ గురువారం తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా 36 మంది పిల్లలను గుర్తించామని, అందులో 16 మందిని 1వ తరగతిలో చేర్పించామన్నారు. మిగిలిన వారిని ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప సమక్షంలో భవిత, అంగన్‌వాడీ కేంద్రాల్లోనమోదు చేయించామని తెలిపారు.

అనారోగ్యంతో విశ్రాంత ప్రిన్సిపాల్ మృతి



సన్యాసమ్మ(ఫైల్)

లేపాక్షి: లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ సన్యాసమ్మ నెల్లూరు జిల్లా రాపూరు గ్రామంలో గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె అర్థిక శాస్త్ర అధ్యాపకురాలిగా 1989 నుంచి 2003 వరకు చిలమత్తూరు డీవీఅండ్ ఆర్ కళాశాలలో పనిచేశారు. 2003లో అమడగూరు ప్రభుత్వ జనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా, 2005 నుంచి 2012 వరకు లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసారు. ఈమె పేద విద్యార్థులకు చేయూత అందించడంలో ఎప్పుడూ ముందుండేవారు. ప్రతి ఇంటికీ తిరిగి చందాలు వసూలు చేసి పేద విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించి ప్రజల మన్ననలను పొందారు. అమడగూరు కళాశాలకు స్థల సేకరణ, లేపాక్షి కళాశాలకు ఆర్టీటీ భవనాలు రావడానికి కృషి చేశారు. ఈమె మృతి పట్ల కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు సంతాపం తెలియజేశారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహం

పెనుకొండ: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా ఉదయం నుంచే ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దయెత్తున స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి రథంపై ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

అమరాపురం/ రొళ్ల: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అమరాపురం, రొళ్ల ఎస్ఐలు జనార్దననాయుడు, రాజశేఖర్ హెచ్చరించారు. గురువారం పోలీస్ స్టేషన్లలో ఎస్ఐలు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్, పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉందన్నారు. టపాసులు అమ్మినా కొనుగోలు చేసినా చట్టారీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్‌మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.